క్లుప్తంగా

భక్తులకు అన్నదానం


ఆలయం వద్ద అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

నగరి : మండలంలోని బుగ్గఅగ్రహారంలో టీటీడీ అనుబంధంగా ఉన్న అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో శనివారం దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి దర్శనానికి విచ్చేసిన భక్తులకు వైజాగ్‌కు చెందిన పవన్ అనే దాత అన్నదానం చేశారు. కార్తీక మాసం కావడంతో ప్రతి శుక్ర, సోమ వారాల్లో అన్నదానం చేయవచ్చని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తెలిపారు. అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యతా పోటీలు


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు


నగరి : స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 56వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని గ్రంథాలయ అధికారులు నైపుణ్యతా పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించగా 40 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి గురుమూర్తి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


మద్యం స్టాకును పరిశీలిస్తున్న మద్యం డిపో సబ్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి

శ్రీరంగరాజపురం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే సిబ్బంది నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మద్యం డిపో సబ్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి అన్నారు. చిత్తూరు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు నాయుడు ఆదేశాల మేరకు శనివారం మండలంలోని వివిధ ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ సహకారంతో మద్యం నియంత్రణ కోసం డిజిటల్ సేవలు అందించే దిశగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. నిరంతరం స్టాక్ రిపోర్ట్‌ను సరి చూసుకోవాలన్నారు. మద్యం అధికరేట్లకు విక్రయించినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మద్యం స్టాకును పరిశీలించారు. ఆయన వెంట వెరిఫికేషన్ ఆఫీసర్ లోకనాథం పాల్గొన్నారు.

సకాలంలో సిమెంట్ పంపిణీ


సిమెంట్ నిల్వ రికార్డులను పరిశీలిస్తున్న డీఈ వెంకటేశ్వర్

పాలసముద్రం : జగనన్న కాలనీల్లో ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సకాలంలో సిమెంట్ పంపిణీ చేస్తున్నామని హౌసింగ్ ఈఈ శంకరప్ప తెలిపారు. శనివారం పాలసముద్రంలోని సిమెంట్ గోదామును ఆయన తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో సిమెంట్ నిల్వల మొత్తానికి నిల్వ ఉన్న స్టాకును సరిచూశారు. జగనన్న లేఅవుట్‌లో గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందించాల్సిన బాధ్యత సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ప్రభుత్వం కూడా సకాలంలో బిల్లులు ఇస్తోందని, ఉచితంగా ఇసుక, తక్కువ ధరకే సిమెంట్ అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని గృహ నిర్మాణ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దాము, సూపర్‌వైజర్ బాబు పాల్గొన్నారు.

ఘనంగా ఊంజల్ సేవ

నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ వేదవల్లి సమేత శ్రీ వేదానారాయణ స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామి అమ్మవార్లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊయలలో కొలువుదీర్చి ఊంజల్ సేవను వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శ్రీనివాసులు, షరాబ్ ఉదయకుమార్, ప్రధాన అర్చకులు నాగరాజు భట్టాచార్యులు పాల్గొన్నారు.

జగనన్న స్మార్ట్‌టౌన్‌తో కొత్తశోభ

- తుడా సౌజన్యంతో ఏర్పాటు
- బ్రోచర్ విడుదల చేసిన మంత్రి ఆర్‌కే రోజా


బ్రోచర్ విడుదల చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : మున్సిపల్ పరిధిలోని కీళపట్టులో తుడా సౌజన్యంతో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ను నిర్మిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. శనివారం తన క్యాంపు కార్యాలయం వద్ద జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ బ్రోచర్ ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, తుడా వారి ఆధ్వర్యంలో 'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్' కీళపట్టులో ఏర్పాటు కానుందన్నారు. మధ్యతరగతి ఆదాయ వర్గాల వారి సౌకర్యార్థం ప్రభుత్వ అనుమతి పొంది ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీలో రిజిస్టర్ అయి మౌలిక సదుపాయాలతో ఏర్పాటు అవుతుందన్నారు. విశాలమైన రోడ్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన లేఅవుట్‌ను తుడా వారు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో 60 నుంచి 40 అడుగుల సిమెంట్ రోడ్లు, కలర్ టైల్స్ ఫుట్‌పాత్‌లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, ఈఎల్ఎస్‌ఆర్‌తో నీటి సరఫరా, భూగర్భ, మురుగు కాలువ, నిరంతర విద్యుత్ సరఫరా, వర్షపు నీటి కాలువలు, వీధి దీపాలు, పార్కులు పచ్చదనం, ప్రహరీ గోడ, ముఖ ద్వార నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల కోసం 20% రిబేటుతో 10% ప్లాట్లను, ప్రభుత్వ పెన్షనర్లకు 5% ప్లాట్లను రిబేట్ లేకుండా కేటాయించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నివాసం ఉండి 18 ఏళ్ల వయసు కలిగి ఆధార్‌కార్డు ఉన్న ఒక కుటుంబానికి ఒక ప్లాటు మాత్రమే కేటాయించనున్నట్లు వివరించారు. తుడా వైస్ చైర్మన్ హరికృష్ణ, తుడా కార్యదర్శి లక్ష్మి, పీఓ శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశీర్వదించిన అందరికీ కృతజ్ఞతలు..

తన పుట్టినరోజును పురస్కరించుకుని నియోజకవర్గం నుంచే కాక రాష్ట్ర నలుమూలల నుంచి, తమిళనాడు నుంచి విచ్చేసి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ మంత్రి ఆర్‌కే రోజా కృతజ్ఞతలు తెలిపారు. తనపై అభిమానంతో సుమారు పదివేల మంది విచ్చేశారని వారందరికీ పుట్టిన రోజు విందు భోజనం అందించడం తనకు భగవంతుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ అభిమానం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

టీడీపీ, జనసేన దళిత వ్యతిరేక పార్టీలు


సమావేశంలో మాట్లాడుతున్న కుప్పయ్య

శ్రీరంగరాజపురం : టీడీపీ, జనసేన దళిత వ్యతిరేక పార్టీలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య అన్నారు. శనివారం ఆయన మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు దళితులను ఓటు బ్యాంకుగానే వాడుకున్నారే తప్ప ఏనాడు దళితుల అభ్యున్నతికి కృషి చేయలేదన్నారు. ఈ నాలుగున్నరేళ్ల జగనన్న పాలనతో దళితుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని, విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడానికి ఆర్థిక సాయం అందించడంతో పాటు వారికి ప్రోత్సాహం కూడా అందిస్తున్నట్లు చెప్పారు. రాజకీయ, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్‌లో ఉన్నత పదవులతో పాటు డిప్యూటీ సీఎంగా అవకాశం కల్పించిన ఘనత జగనన్నకే చెందుతుందన్నారు. సీఎం జగనన్న సహకారంతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ, నిరుద్యోగుల అభివృద్ధికి స్మార్ట్ డీవీ పరిశ్రమను నెలకొల్పి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారని కొనియాడారు. ఇంత చేస్తున్నా టీడీపీ ఇన్‌చార్జ్ థామస్‌కు మాత్రం అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. డిప్యూటీ సీఎంపై అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, రఘు, ఉమాపతి, రఘు, అల్లిముత్తు, చంద్రశేఖర్, జయ, రామ్మూర్తి పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాయనమః



ప్రత్యేక పుష్పాలంకరణలో వినాయక, అయ్యప్ప, సుబ్రమణ్యస్వామి, కిక్కిరిసిన అయ్యప్ప భక్తులు

- అయ్యప్ప భక్తులతో హోరెత్తిన నగరి
- రైలు, బస్సుమార్గంలో నగరి నుంచి 400 మంది శబరిమలకు..

నగరి : అయ్యప్ప భక్తులు నగరి పట్టణం నుంచి ఒక్కసారిగా 400 మంది శబరికొండకు బయలుదేరి వెళ్లడం ప్రత్యేకత సంతరించుకుంది. అక్టోబరు నెల నుంచే భక్తులు అక్కడక్కడా బస్సుల ద్వారా, రైలు మార్గంలో వెళ్తున్నా అధికసంఖ్యలో భక్తులు వెళ్లడం శనివారం చోటు చేసుకుంది. స్థానిక కామాక్షి సమేత కరకంటేశ్వర ఆలయం నుంచే అందరూ బయలుదేరడంతో ఆలయమంతా అయ్యప్ప భక్తులతో నిండింది. అయ్యప్పస్వామి సన్నిధిలో పలువురు గురుస్వాములు ఇరుముళ్లు కట్టగా అయ్యప్ప భక్తులు బయలుదేరారు. 400 మంది భక్తుల్లో సుమారు 250 మంది రైలుమార్గంలో వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయాన్ని పుష్పాలతో నేత్రపర్వంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేశారు. మహా వినాయక, అయ్యప్ప, సుబ్రమణ్యస్వామి విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. ప్రత్యేకంగా రప్పించిన నిపుణులచే పుష్పాలంకరణ చేయించారు. అలంకరణలు భక్తులను ఆకర్షించింది. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు ఉచ్చరించడంతో ఆలయం శబరికొండను తలపించింది. ఈ సందర్భంగా ఆలయంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధికసంఖ్యలో బయలుదేరిన అయ్యప్ప భక్తులను వీక్షించడానికి జనం ఆసక్తి చూపారు. నగరి నుంచి అరక్కోణం రైల్వేస్టేషన్ వరకు వివిధ వాహనాల్లో చేరుకుంటామని అక్కడి నుంచి ట్రైన్‌లో చెంగనూరుకు వెళ్లి అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల్లో శబరికొండకు చేరుకుంటామని అయ్యప్ప గురుస్వాములు తెలిపారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం


విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


వడమాలపేటలో..

పుత్తూరు: పుస్తకాలు చదవడం ద్వారానే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఆర్.వి.ఆర్.ఎస్.ఎస్.శర్మ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవాల నిర్వహణపై శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మెయిన్ స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న చిత్రలేఖనం పోటీలను పరిశీలించారు. అయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షల్లో తరచూ పాల్గొనాలని సూచించారు. గ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మీనాకుమారి పాల్గొన్నారు.

వడమాలపేటలో..

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం వడమాలపేట జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి, విద్యార్థినులకు వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ద్రాక్షాయణి పర్యవేక్షణలో ఉపాధ్యాయులు యామాద్రి, సుందభాష్యం, కుమారి, నరేష్‌బాబు, భారతి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధోశక్తి

వెదురుకుప్పం: నిత్యం పుస్తక పఠనం చేయడం ద్వారా మేధోశక్తిని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయాధికారి మునిరాజ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని పచ్చికాపల్లంలో విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగాలన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవరచుకుని జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ప్రపంచంలో జరుగుతున్న విశేషాలు, సంఘటనలను పుస్తకాలు, వార్తా పత్రికల ద్వారా ఠంఛనుగా తెలుసుకోవచ్చన్నారు. గ్రంథాలయంలో అన్ని రకాల విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ప్రతిభావంతులు, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, క్రాఫ్ట్స్, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పుత్తూరులో చిత్రలేఖనం పోటీలను పరిశీలిస్తున్న శర్మ

మహిళలకు చట్టాలపై అవగాహన


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


పెనుమూరు(కార్వేటినగరం) : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గ్రంథాలయ అధికారి సుబ్రమణ్యం అన్నారు. శనివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలు వి/ాన భాండాగారాలని, అందులోని పుస్తకాలను సద్వినియోగం చేసుకుంటే పోటీ పరీక్షల్లో కూడా ప్రతిభ చాటుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాను సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. అనంతరం పెనుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశులు నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై దృష్టి పెట్టండి


ఆయుధపూజ చేస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం : పంచాయతీ పరిధిలో తడి-పొడి చెత్త వ్యర్థాల సేకరణపై ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు సొంత నిధులతో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తీసుకొచ్చిందన్నారు. అందువల్ల గ్రీన్ అంబాసిడర్లు బాధ్యతగా పని చేసి తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీకి ఆదాయం పెంచాలన్నారు. అనంతరం చెత్త సేకరణ సైకిళ్లకు ఆయుధపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి రాజకుమార్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

స్త్రీనిధిని సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఫరీద్ మస్తాన్

పాలసముద్రం : రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు సత్వర రుణాలను అందిస్తూ లాభాల బాటలో నడుస్తున్న ఏకైక సహకార సంస్థ స్త్రీనిధి అని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల లీడరు, సంఘమిత్ర, వీవో లీడర్, సీసీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం మరిన్ని ఎక్కువ రుణాలు అందించేలా స్త్రీనిధి సంస్థను మెరుగు పరిచే బాధ్యత సభ్యులపై ఉందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన స్త్రీనిధి సంస్థకు పూర్తిస్థాయి యజమానులు సంఘ సభ్యులేనని తెలిపారు. బ్యాంకు లింకేజీల ద్వారా అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర, మురగయ్య, బాలయ్య, మంజుల పాల్గొన్నారు.

నాగలింగేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేకం


హోమం నిర్వహిస్తున్న పండితులు

పుత్తూరు: మండలంలోని రామసముద్రం వేపగుంటకు చెందిన వెంకయ్యగుంటలో వెలసిన శ్రీగంగా నాగలింగేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవం రమేష్ పురోహితులు నేతృత్వంలో వైభవంగా జరుగుతున్నాయి. శ్రీగంగా నాగలింగేశ్వర స్వామి కుంభాభిషేకం సందర్భంగా అమ్మవారు, గణపతి, సుబ్రమణ్యస్వామి, నంది విగ్రహాల ప్రతిష్ట జరిగింది. తొలిరోజు శుక్రవారం గణపూజ స్వస్తిపుణ్యాహవచనం, రుత్వికరణం, రక్షాబంధనం, మృత్యంగ్రహణం, కలశస్థాపన కార్యక్రమాలు జరిగాయి. శనివారం నవగ్రహ పూజ, మండప దేవతారాధన, హోమాలు నిర్వహించారు. ఆదివారం కలశారాధన, శాంతిహోమం, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్నదానం వితరణ చేయనున్నారు. రామసముద్రం, వేపగుంట గ్రామ పెద్దలు కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

టీడీపీ, జనసేనవి నిరాధార ఆరోపణలు


మాట్లాడుతున్న పద్మనాభ రెడ్డి

వెదురుకుప్పం: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని ఎలాగైనా ఓడించాలన్న కుట్రలో భాగంగా ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, ఆయన కుమార్తె కృపాలక్ష్మిపై నిందారోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి అన్నారు. శనివారం వెదురుకుప్పంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టడాన్ని జీర్ణించుకోలేక పోతున్న టీడీపీ ఇన్‌చార్జ్ థామస్, జనసేన ఇన్‌చార్జ్ యుగంధర్ నిత్యం ఏదోరకంగా నారాయణస్వామి కుటుంబంపై అసత్య ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గడిచిన 75 ఏళ్లలో నియోజకవర్గంలో మునుపెన్నడూ జరగని అభివృద్ధి ఈ నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగినట్లు గుర్తు చేశారు. కళ్లముందే అభివృద్ధి, సంక్షేమం కనిపిస్తున్నా వారు కళ్లులేని కబోదుల్లా వ్యవహరించడం హాస్యాస్పదమన్నారు. నియోజకవర్గంలో బీటీ రోడ్లు, సిమెంటు రోడ్లు, ప్రభుత్వ భవన నిర్మాణాలతో పాటు డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రాన్ని తీసుకొచ్చిన ఘనత డిప్యూటీ సీఎం నారాయణస్వామిదే అన్నారు. మంత్రి కుమార్తె కృపాలక్ష్మి వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పేదల సంక్షేమం కోసం సీఎం జగనన్న అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తున్నారని అది చూసి ఓర్వ లేక టీడీపీ, జనసేనకు దిక్కుతోచడం లేదన్నారు. నాయకులు కాదు జగనన్న అందిస్తున్న పథకాలతోనే మళ్లీ గంగాధర నెల్లూరులో అఖండ మెజారిటీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కులగణనపై కార్యదర్శులకు అవగాహన


కులగణనపై కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి

పెనుమూరు(కార్వేటినగరం) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన సర్వేపై కార్యదర్శులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి అన్నారు. శనివారం ఆమె స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కుల గణన సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు కుల గణన సర్వేలో విఫలం కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని సూచించారు. బయట ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారిని, వివాహాలు అయిన మహిళలను విధిగా గుర్తించి ఓటు హక్కును తొలగించాలన్నారు. ఈ నెల 27 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు కులగణన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌నాయుడు, ఈఓపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, డీటీ మహేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా సూరసంహారం వేడుకలు


ఆరుముగ అలంకరణలో సుబ్రమణ్య స్వామి

నగరి : పట్టణ పరిధిలోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో సూరసంహారం పూజలు వైభవంగా జరిగాయి. మంగళవారం ఉత్సవాల్లో ఆరవ రోజు అయిన షష్టి కావడంతో ఆలయాలు హరోహర నామ స్మరణతో మార్మోగాయి. పలువురు భక్తులు సుబ్రమణ్యస్వామి ఆలయాలను 108 సార్లు ప్రదక్షిణ చేశారు. పట్టణ పరిధిలోని కరకంటేశ్వర స్వామి ఆలయంలో వళ్లీ దేవసేన సమేత ఆర్ముగస్వామికి చందన, పంచామృతాభిషేకాలు చేసి ప్రత్యేకంగా కలువపూలతో, చామంతి పూలతో సుందరంగా అలంకరించారు. 5 రకాల ధూపదీప హారతులు ఇచ్చారు. ఈ పూజలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై హారతులు అందుకున్నారు. ఉత్సవ ఉభయదారులకు ఆలయ నిర్వాహకులు మర్యాదలు చేశారు. ఆలయ ఆవరణలో ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి ఈశ్వరగుడి వీధిలో సూరుని ప్రతిమను బాణసంచాల ద్వారా పేల్చి సూర సంహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. బుధవారం ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

భక్తులకు టీటీడీ అన్నప్రసాదాల పంపిణీ

చంద్రగిరి(తిరుచానూరు): పంచమీతీర్థం పురస్కరించుకుని శనివారం తిరుచానూరుకు తరలివచ్చిన లక్షలాది మంది భక్తులకు టీటీడీ అన్నదానం క్యాంటీన్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం, వాటర్ ప్యాకెట్లను అందజేశారు. భక్తుల సౌకర్యార్థం తోళపగార్డెన్, జెడ్పీ ఉన్నత పాఠశాల, పసుపు మండపం సమీపంలో తాత్కాలిక అన్నదాన వితరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చక్రస్నానానికి వచ్చే భక్తులకు పసుపు మండపం వద్ద 30 వేల మందికి, పుష్కరిణిలోకి వెళ్లేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు 20వేల మందికి, మొత్తం 50వేల మందికి అల్పాహారం అందించారు. చక్రస్నానం అనంతరం మూడు ప్రాంతాల్లో 60వేల మంది భక్తులకు మూడు రకాల అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి నిత్యాన్నదానానికి చిత్తూరులోని గిరింపేటకు చెందిన గౌతమి రూ.లక్ష విరాళం అందించారు. ఉదయం దాత కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేసి రూ.లక్ష విరాళం అందించారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

కాణిపాక ఆలయానికి ఉదయం నుంచి భక్తుల తాకిడి మొదలైంది. క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. అయ్యప్ప భక్తుల బృందాలు వందలాది మంది తరలిరావడంతో, ఆలయం వెలుపల వరకు బారులు తీరారు. ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకొని భక్తులకు దర్శనం కల్పించారు.

ఉయ్యాల సేవలో కల్యాణ వెంకన్న


ఉభయ నాంచారులతో కల్యాణ వేంకటేశ్వరుడు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవదేవేరులకు ఊయ్యాల సేవను నిర్వహించారు. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం కావడంతో శనివారం ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామిని అధిష్ఠింప చేశారు. ఊంజల్ మండపంలో గంట పాటు నిర్వహించిన ఊయ్యాల సేవలో ఉత్సవమూర్తులను భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.